క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో తుల్జాభవాని ఉత్సవాలు



ఖిల్లాఘనపురం: మండలంలోని కోతులకుంట తండాలో బుధవారం తుల్జాభవాని అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి అమ్మవారి పూజలకు సంబంధించిన కార్యక్రమాలను చేపట్టిన గిరిజనులు రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఒక్కరి ఇంటి ఎదుట ధాన్యం బస్తాలు, బంతిపూలతో పాటుగా పలురకాల పూలు తదితర వాటితో మండపాన్ని ఏర్పాటు చేసిన గిరిజనులు అమ్మవారిని మండపాల్లో ఉంచి గొర్రె పొటేళ్లను కోసి మొక్కులు తీర్చుకున్నారు. పండుగ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గిరిజన పాటలకు నృత్యాలు చేశారు. బంధువులు, చుట్టు గ్రామాల ప్రజల రాకతో తండాలో పండుగ వాతావరణం ఏర్పడింది.

గేట్‌వాల్ లీకేజీలను అరికట్టండి



పాన్‌గల్: మండలంలోని మాందాపూర్‌లో మిషన్ భగీరథ ట్యాంకు సమీపంలో గేట్ వాల్ లీకేజీలను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. గేట్ వాల్ లీకేజీల ద్వారా చెత్తా, చెదారం చేరి నీరు కలుషితం అవుతూ.. అదే నీరు పైపుల ద్వారా సరఫరా అవుతుండటంతో ఎప్పుడు ఏ రోగాలు సంభవిస్తాయోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ గ్రామంతో పాటు సమీప గ్రామాలకు కూడా ఇదే ట్యాంకు ద్వారా నీరు సరఫరా అవుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గేట్ వాల్ లీకేజీని అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేరాలపై కళాబృందం అవగాహన



గట్టు: మాదక ద్రవ్యాలు, సైబర్ క్రైమ్ నేరాలపై బుధవారం గట్టు బస్టాండ్ ఆవరణలో పోలీస్ కళాబృందం అవగాహన కల్పించారు. ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పోలీస్ కళా బృందం సభ్యులు డయల్ 100, రోడ్డు సేఫ్టీ, సైబర్ క్రైమ్స్, మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలు, పోక్సో కేసులు, సీసీ కెమెరాల వలన ఉపయోగాలు తదితర అంశాలపై వివరించారు. ఏఎస్ఐ అయ్యన్న మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో పోలీసులు ప్రజలకు అండగా నిలుస్తారన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ కళా బృందం సభ్యులు రాధమ్మ, కృష్ణ, రామాంజనేయులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఎద్దు మృతి

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్ ఢీకొని ఎద్దు మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాలు.. మండల పరిధిలోని పుటాన్‌దొడ్డి గ్రామానికి చెందిన కత్తె రాజేష్ భార్య విద్యావతితో కలిసి ఎద్దుల బండిపై వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో కర్నూల్ నుంచి గద్వాల వైపు వెళ్తున్న సూపర్ లగ్జరీ ఆర్టీసీ బస్ ఎద్దుల బండిని ఢీకొట్టింది. ప్రమాదంలో బండిపై ఉన్న దంపతులకు స్వల్ప గాయాలు కాగా ఓ ఎద్దుకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఎద్దు విలువ సుమారు రూ.1లక్ష ఉంటుందని ప్రభుత్వం నుంచి ఆదుకోవాలని బాధితులు కోరారు.

బాల్య వివాహాలను వ్యతిరేకించాలి

గట్టు: ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలు వ్యతిరేకించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సంధ్యారాణి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కిషోర బాలికలు, అంగన్‌వాడీ టీచర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ.. అమ్మాయిలకు 18 ఏళ్లు నిండే వరకు వివాహం చేయకూడదన్నారు. రక్తహీనత దూరం చేసేందుకు మహిళలు సరైన పోషకాహారం తీసుకోవాలన్నారు. ముఖ్యంగా కిషోర బాలికలు రక్త హీనత బారిన పడకుండా అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు వెంకట్రావమ్మ, సుజాతమ్మ, రాజేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ మల్లమ్మ, ఏఎన్ఎం పార్వతి, కిషోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

సర్వే వంద శాతం పూర్తి



పాన్‌గల్‌లో సమగ్ర సర్వే వివరాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు (ఫైల్)

- లక్ష్యం నెరవేర్చిన ఎన్యుమరేటర్లు
- ప్రారంభమైన వివరాల ఆన్‌లైన్ నమోదు

పాన్‌గల్: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర సర్వే మండలంలో జోరుగా సాగుతోంది. ఈనెల 6 నుంచి 8వరకు ఇంటింటికీ స్టిక్కరింగ్ పూర్తి చేసిన ఎన్యుమరేటర్లు.. ఈనెల 9 నుంచి సర్వే ప్రారంభించారు. ప్రతి ఇంట్లో నివసించే వారి సంఖ్యను నిర్ధారించడంతో పాటు ప్రతి కుటుంబం ప్రాథమిక సమాచారం సేకరించి ఫారంలో నమోదు చేశారు. ఒక్కో ఎన్యుమరేటర్‌కు 150 నుంచి 175 ఇళ్లు కేటాయించారు. 56 ప్రధాన ప్రశ్నలు, 19 ఉప ప్రశ్నలు, 243 కోడింగ్ నెంబర్లతో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. కుటుంబంలో తక్కువ మంది ఉంటే అరగంట, ఎక్కువ సంఖ్యలో ఉంటే గంట సమయం పట్టిందని, అయినా పూర్తి వివరాలు సేకరించామని ఎన్యుమరేటర్లు వెల్లడించారు.

మండల వ్యాప్తంగా..

మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో వంద శాతం అంటే 12,090 కుటుంబాల సర్వే పూర్తి చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఆయా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. మండలంలో 108 బ్లాక్‌లు, 108 మంది ఎన్యుమరేటర్లు, 10 మంది సూపర్‌వైజర్లు సర్వేలో పాల్గొన్నారు.

అధికారుల నిత్య పర్యవేక్షణ

మండలంలో పూర్తయిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను పూర్తి స్థాయిలో ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను జిల్లా అధికారులతో పాటు తహసీల్దార్, ఎంపీడీఓలు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు. ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరిగి సేకరించిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు ఎంపీడీఓ గోవింద్‌రావు పేర్కొన్నారు. మండలంలోని 28 జీపీల్లో సర్వే వంద శాతం పూర్తి కావడంతో మొత్తం 12,090 ఇండ్ల ద్వారా సేకరించిన వివరాలను ఎంపీడీఓ కార్యాలయంతో పాటు ఎమ్మార్సీ కార్యాలయాల్లో కంప్యూటర్ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న కంప్యూటర్ అపరేటర్లతో పాటు ప్రైవేటు వ్యక్తులను కూడా ఆన్‌లైన్ నమోదుకు వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సేకరించిన వివరాలను తప్పులు లేకుండా పారదర్శకంగా నమోదు చేయాలని ఆపరేటర్లకు సూచించారు.

నచ్చ చెబుతూ.. ఒప్పిస్తూ..

సర్వే సమయంలో మొదట వ్యక్తిగత సమాచారం ఇచ్చేందుకు కొంతమంది నిరాకరిస్తున్నా.. వారికి ఎన్యుమరేటర్లు అవగాహన కల్పించారని అధికారులు తెలిపారు.

నమోదులో తేడాలుండొద్దు



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సర్వే సమగ్రంగా జరగాలి. ప్రజలకు ముందుగా రేషన్ కార్డులను పంపిణీ చేసి ఉంటే బాగుండేది. సర్వేలో దివ్యాంగులు, ఒంటరి మహిళల గురించి ప్రస్తావించలేదు. చాలా కుల వృత్తులకు సంబంధించినవి కూడా పొందుపర్చకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ప్రజలు చెప్పిన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చేటప్పుడు తప్పులు లేకుండా చూసుకోవాలి

– సూర్యవంశం రాము, సీపీఎం నాయకులు, బుసిరెడ్డిపల్లి

ప్రజలు సహకరించారు



సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రజలు పూర్తిగా సహకరించి వివరాలు అందించారు. మండలంలో వంద శాతం సర్వే పూర్తి చేశాం. సర్వే పూర్తైన తర్వాత జిల్లా అధికారుల ఆదేశానుసారం ఆయా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే చర్యలు చేపట్టాం. తప్పులు లేకుండా నమోదు చేయాలని సిబ్బందికి సూచించాం. ఈ బాధ్యతను కొంతమంది ప్రైవేట్ వ్యక్తులకు సైతం అప్పగించి, నమోదు వేగంగా జరిగేలా చూస్తున్నాం.

– గోవింద్‌రావు, ఎంపీడీఓ, పాన్‌గల్

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు



బుసిరెడ్డిపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఏపీఎం సక్రూనాయక్

పాన్‌గల్: కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఇబ్బందులు కలిగించకుండా ధాన్యం కాంటా చేయాలని ఏపీఎం సక్రూనాయక్ కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. బుధవారం మండలంలోని చింతకుంట, మాందాపూర్, బుసిరెడ్డిపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేమ పేరుతో ధాన్యం సేకరణలో జాప్యం చేయవద్దన్నారు. కాంటా చేసిన ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించి ఆయా వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేసేలా చూడాలన్నారు. కేంద్రాలల్లో నీడ, తాగునీటి వసతి ఏర్పాట్లు చేయాలన్నారు. కేంద్రాలకు తీసుకొచ్చే ధాన్యంలో తాలు, దుమ్ము లేకుండా చూసి నిర్వాహకులకు సహకరించాలని కోరారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుందని రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీసీ బాలశివుడు, వీఓఏలు, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే అరెస్టుకు నిరసనగా రాస్తారోకో



ఆత్మకూర్‌లో..



అమరచింతలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆత్మకూర్: మాగనూర్ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థకు గురైన నేపథ్యంలో నిరసన తెలిపిన మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేయడంతో ఆత్మకూర్‌లో బీఆర్ఎస్ శ్రేణులు చేపట్టిన నిరసన ఉద్రిక్తతకు దారితీసింది. బుధవారం స్థానిక గాంధీచౌక్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు రాస్తారోకో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ నరేందర్ నేతృత్వంలో ఇక్కడికి చేరుకున్న పోలీసులకు, బీఆర్ఎస్ నాయకులకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. అనంతరం బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, విండో అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్ మండ్ల రామకృష్ణ, నాయకులు రియాజ్‌అలీ, జానకీరాములు, జాహంగీర్, రామకృష్ణ, మాసన్న, అరుణ్ తదితరులు ఉన్నారు.

అమరచింత: మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని బుధవారం అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ మాజీ చైర్మన్ ఎస్ఏ రాజు, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు నరసింహులుగౌడ్ మాట్లాడుతూ మాగనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వారం రోజుల వ్యవధిలోనే మూడు పర్యాయాలు విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురికావడం శోచనీయం అన్నారు. విద్యార్థుల పరిస్థితులను తెలుసుకుని వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తన వంతు సాయం అందించడానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి మద్దూరు పోలీసుస్టేషన్‌కు తరలించడం దారుణమన్నారు. కార్యక్రమంలో చిన్న బాలరాజు, జింక రవి, కోఆప్షన్ శానా వాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న జీహెచ్‌ఎం భానుప్రకాష్

వీపనగండ్ల: మండల కేంద్రంలో బుధవారం వివిధ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన మండల స్థాయి వ్యాసరచన పోటీల్లో ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. రెనెబుల్ ఎనర్జీ రీసోర్సెస్ అనే అంశంపై మండల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో కల్వరాల ఉన్నత పాఠశాలకు చెందిన అభినవ్ ఇంగ్లిష్ మీడియంలో మొదటి బహుమతి పొంది జిల్లా స్థాయికి ఎంపిక కాగా.. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల నుంచి చందన తెలుగు మాధ్యమంలో ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 30న వీరు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఉపాధ్యాయులు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు భానుప్రకాష్, ఎఫ్‌పీఎస్‌టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ బలరాముడు అభినందించారు. కార్యక్రమంలో మహేష్, రాజవర్ధనాచారి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తేమ శాతంతో ఇబ్బందులు



వీపనగండ్ల వరి కొనుగోలు కేంద్రంలో నిరీక్షిస్తున్న రైతులు

వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో వరి పంటలను సాగు చేసిన రైతులు ధాన్యాన్ని సరైన తేమశాతం రాకపోవడంతో రాత్రింబవళ్లు వరి కుప్పల వద్దనే నిరీక్షిస్తున్నారు. మండలంలోని జూరాల, భీమా, కేఎల్ఐ కాల్వ కింద దాదాపు 8 వేల ఎకరాలలో వరి పంటలను సాగు చేసిన రైతులు కోతల అనంతరం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం ఆరబెడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సన్నరకం వరిధాన్యంలో 14 శాతం, దొడ్డు రకంలో 17 శాతం మ్యాచర్ రావాల్సి ఉంది. ఇటీవల వాతావరణ పరిస్థితులు పూర్తిగా మారి మంచుకురుస్తుండడంతో ఒక రోజు ధాన్యం ఎండినట్లు చూపిస్తూ ఆ మరుసటి రోజు ధాన్యం పచ్చిగా మారినట్లు చూపిస్తుండడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు.

ధాన్యం ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలి

గోపాల్‌పేట: కాంటా చేసిన వరిధాన్యం ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఆయన ఏదుల మండలంలోని చెన్నారంలో వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిధాన్యం కొనుగోళ్ల విషయంలో అన్ని నిబంధనలు పాటిస్తూ కొనుగోళ్లు జరపాలని సూచించారు. తేమ, తాలు, చెత్త లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వరిధాన్యం సేకరణ అధికారులకు సూచించారు. అంతకు ముందు ఏదుల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన మండలంలో ఎన్ని వరికొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారనే విషయాలపై ఆరా తీశారు.

‘దీక్ష దివస్’ను విజయవంతం చేద్దాం

ఖిల్లాఘనపురం: వనపర్తి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఈ నెల 29న నిర్వహించే దీక్ష దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2009 నవంబర్ 29న ప్రత్యేక తెలంగాణ సాధన కోసం కేసీఆర్ చేపట్టిన దీక్షను, ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకుంటూ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశం మేరకు జిల్లా కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి హాజరవుతారన్నారు. కార్యక్రమ ఇన్‌చార్జ్‌గా యాదాద్రి భువనగిరి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి వస్తున్నారని ఆయన తెలిపారు. మండలంలోని బీఆర్ఎస్ నాయకులు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మున్సిపాలిటీలో మరుగునపడ్డ గ్రంథాలయం



మూత పడిన గ్రంథాలయం

అమరచింత: పట్టణంలో కొన్నేళ్లుగా గ్రంథాలయం మూత పడి ఉన్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో వాటిలోని పుస్తకాలు, గ్రంథాలు చదలు పట్టిపోతున్నాయి. మండలంగా ఏర్పాటు కాకముందే అమరచింతలో శాఖ గంథ్రాయలం నిర్వహిస్తూ పాఠకులకు దిన పత్రికలతో పాటు కథల పుస్తకాలు, వివిధ రకాల నవలలు అందుబాటులో ఉంచేవారు. మండలం ఏర్పడినప్పటి నుంచి గ్రంథాలయ నిర్వహణపై జిల్లా గ్రంథాలయ శాఖ దృష్టి సారించకపోవడంతో ఇప్పటికీ మూసిన తలుపులు మూసినట్టుగానే గ్రంథాలయ భవనం దర్శనమిస్తుంది. పట్టణంలోని కొంతమంది యువకులు, ఉపాధ్యాయులు, వివిధ రాజకీయ పార్టీల నాయకుల సహకారంతో గ్రంథాలయ అవశ్యకతను గుర్తించి చందాలతో కొన్నేళ్లు గ్రంథాలయాన్ని కొనసాగించారు. మాజీ అడ్వకేట్ జనరల్, డీఎంఆర్ఎం ట్రస్ట్ చైర్మన్ దేశాయి ప్రకాష్ రెడ్డి భవనం కిరాయితో పాటు నిర్వాహకుడికి వేతనం అందించేవారు. కొంతకాలనికి ఆయనకు భారం అధికమవ్వడంతో వెనకడుగు వేశారు. దీంతో నాలుగేళ్లుగా పట్టణంలో గ్రంథాలయం మూత పడి ఉంది. మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాతైనా గ్రంథాలయాన్ని పూర్వ వైభవం వస్తుందని ఆశపడిన పాఠకులకు నిరాశే మిగిలింది.

మూడేళ్లుగా..

మున్సిపాలిటీ ఏర్పాటు తర్వాత అధికారుల ఆదేశాల ప్రకారం పట్టణంలో గ్రంథాలయ నిర్వహణ కోసం ప్రతి ఏడాది ఇంటి పన్నుల వసూళ్లలో ఏడు శాతం వాటాను జిల్లా గ్రంథాలయ సంస్థకు పంపుతున్నారు. ఇలా మూడేళ్లుగా మున్సిపల్ ద్వారా మెయింటెనెన్స్ నిధులను జిల్లా గంథ్రాలయ శాఖకు చెల్లిస్తున్నా గంథ్రాలయ తలుపులు మాత్రం తెరుచుకోవడం లేదు.

రహదారిపైనే పంట నూర్పిళ్లు



నాగల్‌కడ్మూర్ శివారులో ప్రధాన రహదారిపై ఆరబెట్టిన ధాన్యం

అమరచింత: మండలంలోని నాగల్‌కడ్మూర్ శివారులో ప్రధాన రహదారి వరి ధాన్యం కుప్పలతో దర్శనమిస్తున్నాయి. రహదారులపై పంట నూర్పిళ్లు చేస్తుండటం, రాత్రి వేళల్లో ధాన్యం కుప్పలపై నల్ల టి టార్పాలిన్ కవర్లు కప్పుతుండడంతో పాటు అవి గాలికి ఎగరకుండా చుట్టూ రాళ్లు పెడుతున్నారు. దీంతో వాటిని గమనించిన ద్విచక్ర, ఆటోల్లో ప్ర యాణం చేస్తున్న వారు ప్రమాదాలకు గురవుతున్న పరిస్థితులు దాపరించాయి. పంట నూర్పిళ్లను కల్లా ల వద్ద ఏర్పాటు చేసుకుంటే రహదారి ప్రమాదాలు నివారించే అవకాశం ఉందని, రైతులు రహదారిపై వరిధాన్యంతో పోయకూడదని ప్రయాణికులు అంటున్నారు. అధికారులు స్పందించి రహదారి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

‘రైతు పండుగను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వేముల శ్రీనివాస్‌రెడ్డి

కొత్తకోట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ఈనెల 28, 29, 30 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించే రైతు పండుగను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేద్దామని కిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూత్పూర్ మండలం అమిస్తాపూర్ వద్ద గురువారం ఉదయం 10గంటలకు ఈ రైతు సదస్సును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారన్నారు. గురువారం జరుగబోయే సదస్సుకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన రైతులు పాల్గొంటారన్నారు. రెండో రోజు 29న జిల్లాయేతర ప్రాంతాల నుంచి రైతులు హాజరవుతాయరని, మొదటి, రెండో రోజు 5000 మంది రైతులు హాజరవుతారని పేర్కొన్నారు. 30వ తేదీన ప్రదర్శనలు, స్టాళ్లను తిలకించిన తర్వాత సాయంత్రం నిర్వహించనున్న బహిరంగ సభలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్ని రైతులను ఉద్దేశించి మాట్లాడుతారన్నారు. మూడు రోజులు రైతు సదస్సు వేదికపై ఆధునిక వ్యవసాయ యంత్ర సామగ్రి, వివిధ రకాల పంట రీతులు, హైబ్రిడ్ వంగడాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలపై 150 స్టాళ్లను ప్రదర్శనలో ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. 30న నిర్వహించే బహిరంగ సభకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కష్ణారావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి, వ్యవసాయ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, విత్తన అభివృద్ధి చైర్మన్ అన్వేష్‌రెడ్డి, దేవరకద్ర నియోజకవర్గ శాసనసభ్యులు జి మధుసూదన్‌రెడ్డితో పాటు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు అధికారులు పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బోయేజ్, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మేస్త్రీ శ్రీనివాసులు, సలీం ఖాన్, ప్రచార కార్యదర్శి మోహన్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రాంలాల్ నాయక్, నరేందర్‌సాగర్, సుభాష్, గోకరయ్య నాయుడు, పట్టణ మాజీ అధ్యక్షుడు కదిరె సాయిలుయాదవ్, దిలీప్‌రెడ్డి, మొద్దు నవీన్‌రెడ్డి, శ్రీకాంత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 30 నిర్వహించే రైతు సదస్సును విజయవంతం చేసేందుకు రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కాంగ్రెస్ పార్టీ మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి కోరారు.

మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక దృష్టి



పాన్‌గల్‌లో విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎంలు

పాన్‌గల్: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం విషయంలో హెచ్‌ఎంలు ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతగా అందించాలని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పీఎస్, యూపీఎస్, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, నాణ్యమైన విద్య అందించడంతో పాటు మధ్యాహ్న భోజనం విషయంలో జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. పరిసరాలు, వంట పాత్రలు శుభ్రంగా ఉండాలని, కూరగాయాలు తాజాగా ఉండేలా పర్యవేక్షణ చేయాలన్నారు. తొలిమెట్టు, న్యాస్, యూడైస్ ప్లస్, అపార్ ఐడీ, ప్రశస్తు యాప్, మధ్యాహ్న భోజనం నిర్వహణ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు.

విద్యార్థులకు అభినందన

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండలంలో నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విజేతలుగా నిలిచిన గణేష్ (బుసిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాల), కళ్యాణి (కేజీబీవీ పాన్‌గల్), శ్రావణి (కేతేపల్లి ఉన్నత పాఠశాల)కు నగదు ప్రోత్సాహకంగా ఒక్కొక్కరికి రూ.100 చొప్పున ఎంఈఓ అందజేశారు. దీంతో పాటు జిల్లా స్థాయిలో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో మండలం నుంచి బహుమతులు పొందిన యూపీఎస్ గోప్లాపూర్, ఉన్నత పాఠశాల కదిరెపాడు, చిక్కేపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు, గైడ్ టీచర్లను సన్మానించి అభినందించారు. విద్యార్థులకు పుస్తకాలను బహుమతులుగా అందజేశారు.



పెద్దమందడి ఎమ్మార్సీ భవనంలో..

కొత్తకోట రూరల్: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యవంతంగా ఉండే విధంగా చూసేందుకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని పెద్దమందడి ఎంఈఓ బాణం విష్ణు సూచించారు. బుధవారం పెద్దమందడి మండలంలోని పీఎస్, యూపీఎస్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులకు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్సీ భవనంలో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓ బాణం విష్ణు మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం నిర్వహణ, అపార్ ఐడీ, ప్రశస్త యాప్, ఎఫ్ఎల్ఎన్, ఎఫ్ఆర్ఎస్ తదిరత అంశాలపై పాఠశాలల వారీగా సమీక్ష చేశారు. విద్యార్థుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, విద్యాపరమైన అన్ని అంశాల్లో విద్యాశాఖ ఆదేశాలను పాటించాలన్నారు. మండలానికి కొత్తగా డీఎస్సీ 2024 ద్వారా నియామకై వచ్చిన ఏడుగురు ఉపాధ్యాయులతో పాటు పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు.